
లక్ష్మణచాంద: సమావేశమైన వద్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల 2005-06 బ్యాచ్ విద్యార్థులు


మామడ: పొన్కల్ పాఠశాలలో కలిసిన పూర్వవిద్యార్థులు


నిర్మల్‌ఖిల్లా: సమావేశమైన నిర్మల్ ఎస్ఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థులు


నిర్మల్‌ఖిల్లా: కలుసుకున్న బుధవార్‌పేట్ జ్ఞానమందిర్ పాఠశాల విద్యార్థులు

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

లక్ష్మణచాంద/నిర్మల్‌ఖిల్లా/మామడ: లక్ష్మణచాంద మండలంలోని వద్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం కనకాపూర్‌లోని రాజరాజేశ్వర ఫంక్షన్‌హాలులో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నిర్మల్‌లోని ఎస్ఎస్ఆర్ హైస్కూల్‌లో 2001–02లో పదోతరగతి చదివిన విద్యార్థులు పట్టణంలోని సిరి ఫంక్షన్‌హాలులో కలుసుకున్నారు. జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్ సరస్వతి జ్ఞానమందిర్ పాఠశాలలో 1999–2000లో పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు నిర్మల్‌లోని బాలాజీ ఫంక్షన్‌హాలులో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. మామడ మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2007–08లో పదోతరగతి చదివిన విద్యార్థులు.. పాఠశాలలోనే సమావేశమై ఉల్లాసంగా గడిపారు. ఎన్నో ఏళ్లకు కలవడంతో ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సందడిగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కారణమైన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండ


చెక్కు అందిస్తున్న మోహన్‌రావు పటేల్

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన రాజు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకోగా నిత్యావసర వస్తువులు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. ఆదివారం బాధిత కుటుంబాన్ని ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పటేల్ పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం సాయంగా రూ.10వేల చెక్కు, వంటపాత్రలు, నిత్యావసర సరుకులు అందించారు.

క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కడెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణనతోపాటు కులగణన చేస్తామని ప్రకటించడం హర్షనీయమని బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం కడెంలో ఆ పార్టీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సత్తెన్న, గంగాధర్, కృష్ణ, తిరుమల్, శ్రీనివాస్, నల్గొండ, భీమన్న, శ్రీరాం, నగేశ్, భూమన్న తదితరులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు


విజేతకు బహుమతి ఇస్తున్న నిర్వాహకులు

మామడ: మండలంలోని కమల్‌కోట్ గ్రామంలో ఆదివారం నూకపెల్లి కిష్టారెడ్డి స్మారకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. విజేతగా నిలిచిన ఖానాపూర్ జట్టుకు రూ.25వేల ప్రైజ్‌మనీ, షీల్డ్.. రన్నరప్‌గా నిలిచిన కమల్‌కోట్ జట్టుకు రూ.15వేల ప్రైజ్‌మనీని అందించారు. కార్యక్రమంలో గంగారెడ్డి, రాజేందర్, మల్లేశ్, గౌతం, లింగారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

నెట్‌లో ప్రతిభ


శ్రావిక

సారంగపూర్: మండల కేంద్రానికి చెందిన కప్పయి శోభ–మోహన్ దంపతుల కుమార్తె శ్రావిక ఇటీవల విడుదలైన సీఎస్ఐఆర్ నెట్ ఫలితాల్లో ప్రతిభ చాటి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హత సాధించింది. తండ్రి మోహన్ టైలరింగ్ పనులు చేస్తుండగా, తల్లి బీడీ కార్మికురాలు. చిన్నతనం నుంచే చదువులో ముందుండే శ్రావిక సౌత్ సెంట్రల్ క్యాంపస్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి నెట్‌కు ప్రిపేర్ అయింది. ఈక్రమంలో ఇటీవల విడుదలైన ఫలితాల్లో శ్రావిక జాతీయస్థాయిలో 42వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి


వాహనం తనిఖీ చేస్తున్న ట్రెయినీ ఎస్సై

తానూరు: వాహనదారులు విధిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ట్రెయినీ ఎస్సై నవనీత్ రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని జౌలా(బి) సరిహద్దులో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారుల ధ్రువపత్రాలు పరిశీలించి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని వాహపదారులను హెచ్చరించారు. ఏఎస్సై శామిల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అడవిలో నిప్పు.. పర్యావరణానికి ముప్పు

- అగ్గి ఆర్పేలా అటవీశాఖ చర్యలు
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


మామడ మండలం నల్దుర్తిలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది


అడవిలో బ్లోయర్ యంత్రంతో మంటలను కట్టడి చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

మామడ: వేసవికాలంలో చెట్లు తమను తాము కాపాడుకునేందుకు ఆకులను రాల్చి తేమను నిలుపుకునేందుకు యత్నిస్తాయి. వర్షాకాలం రాగానే ఆకులు మళ్లీ చిగురిస్తాయి. అయితే.. అటవీ ప్రాంతాల్లో రాలిన ఆకులు కాలిపోతే.. తేమ శాతం తగ్గి చెట్లు ఎండిపోయే ప్రమాదం ఉందని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వేసవిలో ఎండిన ఆకులు, పొడి వాతావరణం కారణంగా అగ్నిప్రమాదాలు జరిగే ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఇది అడవులకు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుంది.

జిల్లాలో తొమ్మిది అటవీ రేంజ్‌లు..

నిర్మల్ జిల్లాలో తొమ్మిది అటవీ రేంజ్‌లు ఉన్నాయి. నిర్మల్ డివిజన్‌లో భైంసా, నిర్మల్, దిమ్మదుర్తి, మామడ అటవీ రేంజ్‌లు ఉండగా.. ఖానాపూర్ డివిజన్‌లో ఖానాపూర్, కడెం, తాంద్ర, ఉడుంపూర్, పెంబి అటవీ రేంజ్‌లు ఉన్నాయి. జిల్లాలో అటవీ విస్తీర్ణం 1,21,660 హెక్టార్లు ఉంది.

అగ్నిప్రమాదాలకు కారణాలు

అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలకు అనుకోని మానవ కార్యకలాపాలు కారణమవుతున్నాయి.

పశువుల కాపరులు: పశువుల మేత కోసం అటవీ ప్రాంతాలకు వచ్చే కాపరులు సిగరెట్ బుడ్డీలు, పొగ తాగేందుకు అంటించిన మంటలను అలక్ష్యంగా వదిలేస్తున్నారు.

వ్యవసాయ కార్యకలాపాలు: అటవీ ప్రాంతాల సమీపంలోని వ్యవసాయ భూములను యాసంగి సాగుకు సిద్ధం చేసేందుకు రైతులు గడ్డి, పొదలు, ఎండిన ఆకులను తగులబెడుతున్నారు. ఈ మంటలు ఆర్పకపోతే అవి అడవిలోకి వ్యాపిస్తున్నాయి.

అటవీ ఉత్పత్తుల సేకరణ: తునికాకు, ఇప్పపువ్వ వంటి అటవీ ఉత్పత్తులను సేకరించేందుకు కొందరు కావాలనే నిప్పు పెడుతున్నారు. ఇది మంటల వ్యాప్తికి దారితీస్తోంది. ఈ చర్యలు అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలను తీవ్రతరం చేస్తున్నాయి, దీంతో అటవీ సంపద నాశనమవుతోంది.

కాలిపోతే పర్యావరణంపై ప్రతికూల ప్రభావం..

అడవిలో అగ్నిప్రమాదాలు జరిగి చెట్లు కాలిపోతే పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అగ్నిప్రమాదాలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి.

చెట్ల నష్టం: ఎండిన ఆకులు కాలిపోవడంతో చెట్లు తేమను కోల్పోయి మోడుగా మారుతున్నాయి. ఇది అవి ఎండిపోయే ప్రమాదాన్ని పెంచుతాయి.

జీవవైవిధ్య నష్టం: అగ్నిప్రమాదాలతో అటవీ జంతుజాలం ఆవాసాలను కోల్పోతోంది. అనేక చిన్న జంతువులు మంటల్లో చిక్కుకుని చనిపోతున్నాయి.

మొక్కల వినాశనం: వివిధ రకాల మొక్కలు నాశనమవుతున్నాయి, అనవసరమైన కలుపు మొక్కలు పెరిగే అవకాశం ఉంది.

నేల, జల వనరులపై ప్రభావం: ఆకులు కాలిపోవడంతో నేల తేమను కోల్పోతుంది, భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది. ఈ నష్టాలు పర్యావరణ వ్యవస్థను దీర్ఘకాలంగా దెబ్బతీస్తా యి, జీవవైవిధ్యం, స్థానిక వాతావరణంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి.

అటవీశాఖ చేపడుతున్న చర్యలు..

అడవిలో అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.

అవగాహన కార్యక్రమాలు: అటవీ ప్రాంతాల సమీపంలోని గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తూ, నిప్పు అంటిస్తే కలిగే నష్టాలను వివరిస్తున్నారు. పశువుల కాపరులు, రైతులను కలిసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఫైర్‌లైన్స్ ఏర్పాటు: అటవీ ప్రాంతాల్లో ఫైర్‌లైన్స్ (మంటల వ్యాప్తిని అడ్డుకునే ఖాళీ జోన్‌లు) ఏర్పాటు చేస్తున్నారు. ఇవి మంటలు వ్యాపించకుండా నిరోధిస్తాయి.

బ్లోయర్ యంత్రాల వినియోగం:

మంటలు వ్యాపించినప్పుడు వాటిని అదుపు చేసేందుకు బ్లోయర్ యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ఈ యంత్రాలు గాలిని ఒకే దిశలో ఊది మంటలను ఆర్పుతాయి.

పర్యవేక్షణ, శిక్షణ: అటవీ సిబ్బందికి అగ్ని నివారణ శిక్షణ ఇస్తూ, ప్రమాద హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేస్తున్నారు.

వేసవిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం



వేసవి కాలం కావడంతో అడవిలో మంటలతో నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. అప్రమత్తంగా ఉండి నిప్పును ఆరంభ దశలోనే బ్లోయర్ యంత్రాల ద్వారా ఆర్పేలా చర్యలు తీసుకుంటున్నాం. మంటలతో కలిగే నష్టాలను గ్రామస్తులకు వివరిస్తున్నాం. ముందస్తుగా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయిస్తున్నాం.

– శ్రీనివాస్‌రావు, ఎఫ్ఆర్‌వో, దిమ్మదుర్తి

స్థానికుల సహకారం..

అటవీలో అగ్నిప్రమాదాల నివారణలో స్థానికుల సహకారం కీలకం. అటవీశాఖ అధికారులు గ్రామస్తులతో సమన్వయం చేసుకుంటూ వారిని అటవీ సంరక్షణలో భాగస్వాముల్ని చేసేందుకు యత్నిస్తున్నారు. గ్రామీణ సమాజంలో అగ్ని జాగ్రత్తలపై అవగాహన పెంచడం, పశువుల కాపరులు, రైతులకు సురక్షిత పద్ధతులను నేర్పడం వంటి చర్యలు ఈ సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి.

దీర్ఘకాలిక పరిష్కారాలు..

అటవీ అగ్నిప్రమాదాలను శాశ్వతంగా నివారించడానికి దీర్ఘకాలిక చర్యలు అవసరం.

సాంకేతికత వినియోగం: శాటిలైట్ ఆధారిత అగ్ని పర్యవేక్షణ వ్యవస్థలు, డ్రోన్‌లు వంటి సాంకేతికతను అటవీ ప్రాంతాల్లో మంటల గుర్తింపు కోసం ఉపయోగించవచ్చు.

పర్యావరణ విద్య: పాఠశాలలు, కళాశాలల్లో అటవీ సంరక్షణ మరియు అగ్ని నివారణపై విద్యను ప్రోత్సహించడం.

సమాజ భాగస్వామ్యం: అటవీ సంరక్షణ కమిటీలను గ్రామీణ స్థాయిలో బలోపేతం చేయడం, స్థానికులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం. ఈ చర్యలు అటవీ సంపదను కాపాడడంతో పాటు, పర్యావరణ సమతుల్యతను నిలబెట్టడంలో సహాయపడతాయి.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


సాయినాథ్ (ఫైల్)

తానూరు: మండలంలోని కోలూరు గ్రామానికి చెందిన గోనేవాడ్ సాయినాథ్ (60) అనే వ్యక్తి అదృశ్యం కాగా కేసు నమోదైనట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. సాయినాథ్ ఈనెల 3న వైద్య పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. అదేరోజు మధ్యాహ్నం 12గంటలకు కుటుంబీకులు ఫోన్ చేస్తే బాసరలో ఉన్నట్లు చెప్పాడు. తర్వాత ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. తెలిసిన వారి ఇళ్లలో వెతికి..హైదరాబాద్‌లో ఉన్న బంధువులకు ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో సాయినాథ్ కుమారుడు ప్రశాంత్ ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ట్రెయినీ ఎస్సై పేర్కొన్నారు.

పట్టపగలే వెలుగులు..



లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ గ్రామంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో వీధిస్తంభాల బల్బులు రోజంతా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని.. స్తంభాల బల్బులు రాత్రి మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లేస్తోంది..



లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) చెరువు దగ్గర ట్రాన్స్‌ఫార్మర్‌ను మొక్కల తీగలు అల్లుకున్నాయి. అధికారులు స్పందించి తీగలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిన్నారులు.. అదరహో

- ఆటపాటల్లో రాణిస్తున్న పిల్లలు
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు



భైంసాటౌన్: ఆసక్తి ఉన్న రంగాల్లో తల్లిదండ్రుల ప్రోత్సహించి శిక్షణ అందిస్తే అద్భుతాలు చేయవచ్చని నిరూపిస్తున్నారు ఈ చిన్నారులు. సెల్‌ఫోన్ చేతిలో ఉంటే గాని నోట్లో అన్నం ముద్ద పెట్టని పిల్లలున్న ప్రస్తుత కాలంలో.. చదువుతోపాటు ఆటపాటల్లో రాణిస్తూ.. ఔరా..! అనిపిస్తున్నారు.. ఈ అన్నాచెల్లెలు. భైంసా పట్టణంలోని సంతోషిమాత నగర్‌కు చెందిన ముద్దం విక్రమ్–కవిత దంపతులకు శ్రేయాన్ కార్తికేయ, శ్రీదేవిక సంతానం. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శ్రేయాన్ ఆరో తరగతి.. శ్రీదేవిక మూడో తరగతి చదువుతోంది. ఈ చిన్నారులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ సత్తా చాటుతున్నారు. పలు పోటీలు, ప్రదర్శనల్లో పాల్గొంటూ విజయాలు అందుకుంటున్నారు.

ఆరేళ్లకే గిన్నిస్‌బుక్‌లో చోటు..

ఇక చిన్నారి శ్రీదేవిక తన ఆరేళ్ల వయసులోనే గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సాధించింది. చిన్నప్పటి నుంచే నృత్యంలో చిన్నారి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు స్థానికంగా నృత్య శిక్షకుల వద్ద కూచిపూడి, వెస్టర్న్ డ్యాన్స్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. దీంతో ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన రికార్డు స్థాయి నృత్య ప్రదర్శనలో పాల్గొని గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించి ప్రశంసాపత్రం భైంసాలో ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ చేతుల మీదుగా అందుకుంది. అంతేగాక తిరుపతి, షిర్డీలో నిర్వహించిన నృత్య ప్రదర్శనల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకుంది. ఇలా.. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచి.. ఏదైనా అంశాల్లో శిక్షణ ఇప్పిస్తే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినవారవుతారు.

ఎమ్మెల్యే చేతులమీదుగా గిన్నిస్ రికార్డు పత్రం అందుకుంటున్న చిన్నారి శ్రీదేవిక

జ్ఞాపకశక్తిలో దిట్ట హిమాన్ష్..


తల్లిదండ్రులతో హిమాన్ష్

భైంసాకు చెందిన రాజేశ్వర్–రజిత దంపతుల కుమారుడు హిమాన్ష్ జ్ఞాపకశక్తి చూస్తే భళా అని ఆశ్చర్యపోవాల్సిందే. పదేళ్ల ప్రాయంలోనే ఈ చిన్నోడు దేశాలు, వాటి రాజధానుల పేర్లు అలవోకగా చెప్పేస్తాడు. 30 దేశాలకు చెందిన జాతీయ జెండాలను ఇట్టే గుర్తు పట్టేస్తాడు. సంస్కృత పద్యాలు, శ్లోకాలను అవలీలగా చదివేస్తూ ప్రతిభ చూపుతున్నాడు. హిమాన్ష్ తండ్రి రాజేశ్వర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా అతనిలో ప్రతిభను సానబెడుతూ మరింత మెరుగులద్దేలా ప్రోత్సహిస్తున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో శ్రేయాన్..


సీఎం కప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన శ్రేయాన్ కార్తికేయ

చిన్నప్పటి నుంచే ఆటలపై శ్రేయాన్ కార్తికేయకు ఉన్న ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. పట్టణంలో వుషూ కోచ్ శ్రీరాముల సాయికృష్ణ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించారు. శ్రీయాన్ కార్తికేయ ఇప్పటివరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పలుమార్లు బంగారు, కాంస్య పతకాలు సాధించాడు. ఇటీవల సిరిసిల్ల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి వుషూ పోటీల్లో 28 కేజీల విభాగంలో పాల్గొని బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీలకూ ఎంపికయ్యాడు. గత డిసెంబర్‌లో జరిగిన సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ కాంస్య పతకం పొందాడు. 2024లో హైదరాబాద్‌లో జరిగిన వుషూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. అదే ఏడాది చుక్క ధర్మరాజు మెమోరియల్ ఆధ్వర్యంలో జరిగిన స్టేట్ లెవెల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వుషూ, కరాటేలో బంగారు పతకాలు సాధించాడు.

అధ్వానంగా సిరాల రోడ్డు


కంకర తేలిన రోడ్డు


గుంతలమయంగా రోడ్డు

భైంసారూరల్: మండలంలోని సిరాల రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. భైంసా నుంచి నాందేడ్ వెళ్లే జాతీయ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సిరాల గ్రామానికి సరైన మార్గం కరువైంది. దీంతో తానూరు మండలం ఉమ్రి మీదుగా మట్టి రోడ్డుపై ప్రయాణం సాగిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గంగన్న సేవలు అభినందనీయం


అంబలి తాగుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న సేవలు అభినందనీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ బస్టాప్ వద్ద గంగన్న ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈసందర్భంగా పలువురితో కలిసి అంబలి తాగారు. ప్రతి ఏటా అంబలి కేంద్రాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్న గంగన్నను ఎమ్మెల్యే అభినందించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

చెట్టుపై పిడుగు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. మండలంలోని లక్కారంలో రెడ్డి శ్రీధర్ ఇంటి ఆవరణలో చెట్టుపై పిడుగు పడింది. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు.